క్లుప్తంగా

నిత్యావసర సరుకుల పంపిణీ



బొంబాయిగూడలో నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ప్రకాశ్

పెంచికల్‌పేట్: మండలంలోని బొంబాయిగూడ గ్రామానికి చెందిన నాలుగు నిరుపేద కుటుంబాలకు సామాజిక కార్యకర్త చాపిడే ప్రకాశ్ ఆధ్వర్యంలో మంగళవారం నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు చౌదరి గుండయ్య, ఆనంద్, ప్రసన్న, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగులకు అవకాశం కల్పించాలి'



వినతిపత్రం అందజేస్తున్న కోవ విజయ్

కెరమెరి: ఉన్నత చదువులు చదివిన ఆదివాసీ నిరుద్యోగులకు కెరమెరి అటవీశాఖ రేంజ్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు కోవ విజయ్ కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫారెస్టు రేంజ్ కార్యాలయంలో ఎఫ్ఆర్‌వో మజారొద్దీన్‌కు వినతిపత్రం అందించారు. ఏజెన్సీ మండలం కావడంతో గిరిజన చట్టాలు అమలులో ఉన్నా, ఇప్పటికీ అనేక పోస్టుల్లో ఆదివాసీలు ఎవరూ లేరని పేర్కొన్నారు. ఆదివాసీ యువత ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు లేక నిరుద్యోగంతో సతమతమవుతున్నారని, అధికారులు స్పందించి ఆదివాసీలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ దండె విఠల్

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్లూర్ గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా ఎమ్మెల్సీ దండె విఠల్ మంగళవారం పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రగతి పథంలో పయనిస్తుందని పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు సముద్రాల రాజన్న, జునుగరి సదాశివ్, ఇలియాస్, చౌదరి శ్రీనివాస్, చంద్రమౌళి, శంకర్‌గౌడ్, ఆశన్న, లాంచు, కృష్ణ, అతహాబేగ్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీలో యువకుల చేరిక



బీజేపీ కండువా కప్పుకున్న యువకులు

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని సంఘం బస్తీ, సుభాష్‌కాలనీ బస్తీకి చెందిన పలువురు యువకులు మంగళవారం బీజేపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు బీజేపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే స్థానిక ఎన్నికల్లో యువకులు ముందుండి కలిసికట్టుగా పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పెర్క ప్రశాంత్, బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ వీరభద్రచారి, అరుణ్‌లోయ, సాయి, అనిల్, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోతి దాడిలో ఒకరికి గాయాలు



చికిత్స పొందుతున్న బాధితుడు

దహెగాం: మండలంలోని ఈటపల్లి గ్రామానికి చెందిన బోరే పోశం అనే రైతుపై కోతి దాడి చేసి గాయపర్చింది. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం పత్తి చేనుకు వెళ్తున్న క్రమంలో కోతులు గుంపులుగా ఉండడంతో వాటిని చెదరగొడుతుండగా కోతి ఒక్కసారిగా వచ్చి దాడి చేసి గాయపర్చింది. కోతి దాడిలో కాలికి గాయం కావడంతో మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకున్నాడు.

ఆశలు గల్లంతు!

- తారుమారైన రిజర్వేషన్లు
- ఆందోళనలో గిరిజనులు
- ఎస్టీలకు రిజర్వు కాని ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాలు
- ఎన్నికలను బహిష్కరిస్తామంటున్న ఆదివాసీలు

మండలంలో ఎంపీటీసీ స్థానాల రిజర్వేషన్లు..

ఎంపీటీసీ స్థానం	రిజర్వేషన్ కేటగిరి
1. మోడి	జనరల్ (మహిళ)
2. అనార్‌పల్లి	జనరల్
3. కెరమెరి -2	ఎస్టీ(జనరల్)
4. పరంధోలి	ఎస్టీ(జనరల్)
5. సుర్దాపూర్	ఎస్టీ(మహిళ)
6. నిషాని	ఎస్టీ(మహిళ)
7. కెరమెరి-1	బీసీ(జనరల్)
8. అంతాపూర్	బీసీ(మహిళ)
9. గోయగాం	బీసీ(జనరల్)

ఎంపీపీ, జెడ్పీటీసీ స్థానాల రిజర్వేషన్లు..

పదవీ	2019	2025
ఎంపీపీ	ఎస్టీ జనరల్	జనరల్ (మహిళ)
జెడ్పీటీసీ	ఎస్టీ (మహిళ)	బీసీ జనరల్



కెరమెరి మండల మ్యాప్

కెరమెరి: గడిచిన కొంతకాలంగా ఎంపీపీ, జెడ్పీటీసీ పదవులపై నేతలు పెట్టుకున్న ఆశలు ఆవిరయ్యాయి. త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన రిజర్వేషన్‌లను ప్రభుత్వం విడుదల చేసింది. మండలంలో 2019 ఎన్నికల్లో ఎంపీపీ ఎస్టీ జనరల్‌కు రిజర్వు కాగా, జెడ్పీటీసీ ఎస్టీ మహిళకు కేటాయించారు. ఒక దఫా రిజర్వేషన్లు ప్రకటిస్తే పదేళ్ల వరకు ఉంటాయనుకున్న తరుణంలో అనూహ్యంగా ఐదేళ్ల పదవీ కాలంలోనే రిజర్వేషన్లు మారిపోయాయి. మండలానికి సంబంధించిన ఎంపీపీ, జెడ్పీటీసీల రిజర్వేషన్లు మారిపోవడంతో గిరిజన ఆదివాసీల్లో నిరుత్సాహం నెలకొంది. ఈ సారి ఎంపీపీ జనరల్ (మహిళ), జెడ్పీటీసీ (బీసీ జనరల్)లకు కేటాయించారు.

2009 నుంచి రిజర్వేషన్లు ఇలా..

మండలంలో 31 గ్రామ పంచాయతీలు ఉండగా 156 హ్యాబిటేషన్లు ఉన్నాయి. వాటిలో 30,724 జనాభా ఉంది. 18,254 మంది ఓటర్లు ఉన్నారు. మండలంలో అత్యధికంగా ఎస్టీ జనాభా ఎక్కువగా ఉన్న గ్రామాలు ఉన్నాయి. 2011 జనాభా లెక్కల ప్రకారం ఎస్టీ జనాభా 16,129, ఎస్సీ 3,298, ఇతరులు 11,297 మంది ఉన్నారు. 2009లో జరిగిన స్థానిక ఎన్నికల్లో ఎంపీపీ ఎస్టీలకు రిజర్వు చేయగా, జెడ్పీటీసీ జనరల్, 2014లో జెడ్పీటీసీ జనరల్, ఎంపీపీ బీసీ, 2019లో జెడ్పీటీసీ ఎస్టీ మహిళ, ఎంపీపీ ఎస్టీ జనరల్‌కు కేటాయించారు. ఈసారి కూడా 2019లో ఉన్న రిజర్వేషన్లే ఉంటాయని భావించినప్పటికీ రిజర్వేషన్లు మారిపోయాయి.

కీలకంగా మోడి, అనార్‌పల్లి..

ఎంపీపీ స్థానం జనరల్ మహిళకు కేటాయించడంతో అన్ని పార్టీల నేతలు ఆలోచనలో పడ్డారు. ఏ పార్టీలో కూడా మహిళా నేతలు లేరు. దీంతో అన్ని పార్టీల్లో మహిళా నేతల కోసం వెతుకులాట ప్రారంభమైంది. కాగా మండలంలో 9 ఎంపీటీసీ స్థానాలు ఉండగా అనార్‌పల్లి జనరల్, మోడి జనరల్(మహిళ)కు రిజర్వు కావడంతో ఆ రెండు కేంద్రాల్లో ఎంపీపీ పదవికి పోటీ కీలకం కానుంది. కాగా ఎంపీపీ పదవి కోసం అన్ని పార్టీల నేతలు మోడి జనరల్ (మహిళా) స్థానంపై గురిపెట్టారు. పార్టీల్లో దీటైన అభ్యర్థులు దొరక్కుంటే ప్రముఖ నేతలు తమ సతీమణులను బరిలో దించి గెలిపించే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి.

ఎస్టీలకే కేటాయించాలని డిమాండ్..

రిజర్వేషన్లు ప్రకటించిన నుంచి గిరిజన ఆదివాసీలు రగులుతున్నారు. ఆదివాసీ చట్టాలకు తూట్లు పొడుస్తున్నారని ఆరోపణలు చేస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతమైన కెరమెరిలో 70 శాతం ఎస్టీ జనాభా ఉంది. ఇది 5వ షెడ్యూల్ భూభాగంలో ఉంది. దీంతో ఇక్కడి జెడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను ఎస్టీలకే కేటాయించాలనే ప్రధాన డిమాండ్‌తో ఆదివాసీలు ఆందోళనలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఇటీవల తుడుందెబ్బ, ఇతర ఆదివాసీ సంఘాల నేతలు కలెక్టర్ వెంకటేశ్ దోత్రేను కలిసి వినతిపత్రం సమర్పించారు. రిజర్వేషన్లు మార్చకుంటే స్థానిక ఎన్నికలను బహిష్కరిస్తామని వారు పేర్కొంటున్నారు.

ఆదివాసీ చట్టాలకు తూట్లు



గిరిజన చట్టాలకు తూట్లు పొడిచేలా రిజర్వేషన్లు ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో ముఖ్యమైన పోస్టులను ఇతరులకు కేటాయించడం ఆమోదయోగ్యం కాదు. 5వ షెడ్యూల్ భూభాగంలో పెసా చట్టాలను పకడ్బందీగా అమలు చేయాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రిజర్వేషన్లు ప్రకటించింది. రిజర్వేషన్లు మార్చకుంటే ఎన్నికలను బహిష్కరిస్తాం.

– కోవ విజయ్, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు

కోర్టు తీర్పు వరకు వేచి చూస్తాం..



ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్లు అర్థం కాని పరిస్థితులు ఉన్నాయి. వీటిని ఎలా ప్రకటించారో తెలియడం లేదు. పూర్తిగా ఎస్టీల జనాభా అధికంగా ఉన్న పరంధోలిలో ఎస్టీ(జనరల్)కు కేటాయించారు. రిజర్వేషన్ల వ్యవహారం కోర్టులో ఉంది. 8న కోర్టు తీర్పు వరకు వేచి చూస్తాం.

– సయ్యద్ అబ్దుల్ కలాం, మాజీ వైస్ ఎంపీపీ

భీం వర్ధంతికి మంత్రులకు ఆహ్వానం

కెరమెరి: మండలంలోని జోడేఘాట్‌లో ఈ నెల 7న నిర్వహించే కుమురం భీం 85వ వర్ధంతికి హాజరు కావాలని రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్‌లను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ లక్ష్మణ్, కుమురం భీం మనుమడు కుమురం సోనేరావు ఆహ్వానించారు. మంగళవారం హైదరాబాద్‌లోని క్యాంప్ ఆఫీసులో కలిసి ఆహ్వానపత్రం అందించారు. మాజీ ఎంపీపీ పెందోర్ మోతిరాం ఉన్నారు.



ఆహ్వానపత్రం అందజేస్తున్న నాయకులు

భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రులు



శాకంబరీ దేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో శరన్నవరాత్రులు ఘనంగా జరుపుకుంటున్నారు. స్థానిక కేశవనాథ ఆలయంలో గత తొమ్మిది రోజులుగా భక్తిశ్రద్ధలతో ఆలయంలోని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నవరాత్రుల్లో భాగంగా ప్రతీరోజు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వాహనాల్లో ఊరేగింపు నిర్వహిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో మహా చండీ హోమం

దహెగాం: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా మండల కేంద్రంలోని స్థానిక శివాలయంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి మండపం వద్ద మంగళవారం మహాచండీ హోమం నిర్వహించారు. వేదపండితులు పరమేశ్వర్ శర్మ, మహేశ్ శర్మ, విఘ్నేష్ శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారు తొమ్మిదో రోజు దుర్గాదేవి రూపంలో దర్శనమిచ్చారు.



చండీ హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

శాకంబరీ దేవిగా అమ్మవారు

కెరమెరి: 11 రకాల కూరగాయల అలంకరణ తో శాకంబరీ దేవీ రూపంలో మంగళవారం అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంలో తుజాల్‌పురం కాంప్లెక్స్‌లోని దుర్గాదేవి ఆలయంలో తుజాల్‌పురం ప్రవీణ్ గౌడ ఆధ్వర్యంలో అలంకరించిన అమ్మవారు రూపాన్ని తిలకించి భక్తులు మంత్రముగ్ధులయ్యారు. అర్చకుడు కులకర్ణీ బాపూదేవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పేకాడుతున్న ఏడుగురు అరెస్ట్



పోలీసుల అదుపులో నిందితులు

కాగజ్‌నగర్‌రూరల్: కాగజ్‌నగర్ మండలంలోని బారెగూడ గ్రామ శివారులో మంగళవారం పేకాట ఆడుతున్న ఏడుగురిని కాగజ్‌నగర్‌రూరల్ ఎస్సై సందీప్ దాడి చేసి పట్టుకున్నారు. పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి నగదు, పేకాట సామగ్రి స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు. ఎస్సై సందీప్ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు చేపడితే సహించేది లేదన్నారు. దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ బూత్ పరిశీలన



పోలింగ్ బూత్ పరిశీలిస్తున్న ఎస్సై చంద్రశేఖర్

కౌటాల: మండలంలోని వీర్దండి, బాలేపల్లి గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను మంగళవారం ఎస్సై చంద్రశేఖర్ పరిశీలించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు అందరూ సహకరించాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వాహనదారులు రూ. 50వేలకు మించి డబ్బులు తరలించొద్దన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మహిళలకు వైద్య పరీక్షలు



కెరమెరి: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కెరమెరి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం 'స్వస్థ నారి స్వశక్త్ పరివార్' కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వివిధ గ్రామాలకు చెందిన 41 మంది మహిళా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మాత్రలు అందించారు. మహిళల్లో దీర్ఘకాలిక వ్యాధులతో పాటు ఇతర వ్యాధులను గుర్తించి తగిన వైద్య సదుపాయాలు అందించేందుకు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఆసిఫాబాద్, కెరమెరి వైద్యులు సాయిచరణ్ రెడ్డి, సోహెల్ పేర్కొన్నారు.



కంటి వైద్య పరీక్షలకు వచ్చిన రోగులు

ఉచిత కంటి వైద్య శిబిరం

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణంలోని కిమ్స్ మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిలో కొత్తపల్లి వెంకటలక్ష్మి -చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో ఆరుగురికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. బెల్లంపల్లి లయన్స్ క్లబ్ సహకారంతో ఉచిత ఆపరేషన్లు చేయించనున్నట్లు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు. అప్తమాలజిస్ట్ శ్రీ నాథ్, ఐ క్యాంప్ ఇన్‌చార్జి గోపి పాల్గొన్నారు.

'ఎంపీడీవో రాజేందర్ సేవలు మరువలేనివి'



ఎంపీడీవోను సన్మానిస్తున్న శ్రద్ధాశుక్లా

దహెగాం: దహెగాం ఎంపీడీవోగా రాజేందర్ సేవలు మరువలేనివని కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధాశుక్లా అన్నారు. మంగళవారం ఎంపీడీవో రాజేందర్ పదవీ విరమణ సందర్భంగా మండలంలోని బీబ్రా గ్రామంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎంపీడీవోను శాలువాతో సన్మానించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగంలో పదవీ విరమణ సహజమన్నారు. ఉద్యోగం చేస్తున్న క్రమంలో ప్రజా సేవ చేయడంతోనే తృప్తి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మునవార్ షరీఫ్, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవాగుకు చేరిన బతుకమ్మ



కెరమెరి: పెద్దవాగులో బతుకమ్మ జారవిడుస్తున్న మహిళలు



ఆసిఫాబాద్: బతుకమ్మ పోటీల్లో బహుమతి అందజేస్తున్న ప్రతినిధులు

కెరమెరి: తెలంగాణ సాంస్కృతి సంప్రదాయాలకు చిహ్నంగా నిలిచే బతుకమ్మ ఉత్సవాలు మంగళవారం ముగిశాయి. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీ, నెహ్రూనగర్, విద్యానగర్, వివేకానందనగర్ కాలనీకి చెందిన మహిళలతోపాటు సాంగ్వి, అనార్‌పల్లి, ఝరి, మోడి, గోయగాం, కెలిబి తదితర గ్రామాల్లో సద్దుల బతుకమ్మను ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పాటలు పాడుతూ దాండియా నృత్యాలు చేశారు. చిన్నారులు, పెద్దలు ఉత్సవాల్లో పాల్గొన్నారు. తెల్లవారుజాము వరకు నృత్యాలు చేసి భాజాభజంత్రీలతో వెళ్లిపోవమ్మ.. వెళ్లి రావమ్మా! అంటూ బతుకమ్మలను నెత్తిన మోసుకుని సాంగ్వి పెద్దవాగుకి చేరారు. అనంతరం గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత నీటిలో జారవిడిచి వీడ్కోలు పలికారు.

సద్దుల బతుకమ్మ సంబురాలు

కౌటాల: మండలంలోని గ్రామాల్లో మంగళవారం రాత్రి భక్తిశ్రద్ధలతో సద్దుల బతుకమ్మ సంబురాలు నిర్వహించారు. పిల్లలు, మహిళలు వివిధ రకాల పూలతో సద్దుల బతుకమ్మలు పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో బతుకమ్మ పాటలు పాడుతూ ఆటలు ఆడారు.

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలో సద్దుల బతుకమ్మ సంబరాలు మంగళవారం ముగిశాయి. సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు మహిళలు బతుకమ్మ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. పట్టణంలోని బజార్‌వాడి, తారకరామానగర్, జన్కాపూర్‌తో పాటు ఆయా కాలనీల్లో మంగళవారం తెల్లవారుజామువరకు మహిళలు బతుకమ్మ ఆడిపాడారు. అనంతరం స్థానిక పెద్దవాగులో నిమజ్జనం చేశారు. జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్తమ బతుకమ్మలకు బహుమతులు ప్రదానం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధులు చిలువేరు వెంకన్న, గంధం శ్రీనివాస్, రావుల శంకర్, మురళీధర్, వెంకటేశ్వర్, ప్రమోద్, గణేశ్, ప్రదీప్, శ్రీనివాస్, కృష్ణమూర్తి వినేశ్, వెంకన్న పాల్గొన్నారు.

వాంకిడి: మండల వ్యాప్తంగా మంగళవారం సద్దుల బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి వాడవాడల్లో మహిళలు వేడుకలు జరుపుకున్నారు. అనంతరం బతుకమ్మలను సమీప వాగుల్లో నిమజ్జనం చేశారు.



వాంకిడి: బతుకమ్మతో చిన్నారి



కౌటాల: తలోడిలో బతుకమ్మతో మహిళ

'మహిళా సదస్సు' విజయవంతం చేయాలి

కౌటాల: కాగజ్‌నగర్ పట్టణంలోని వినయ్ గార్డెన్‌లో అక్టోబర్ 5, 6 తేదీల్లో నిర్వహించే మహిళా సదస్సును విజయవంతం చేయాలని సీఐటీయూ మండల నాయకుడు మోర్లె నాగేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మహిళ రాష్ట్ర సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. మహిళా సదస్సులో మహిళల సమస్యలు, ఆర్థిక, రాజకీయ, సామాజిక, ఉద్యోగ భద్రత, తదితర అంశాలపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. జిల్లాలో తొలిసారి నిర్వహించే ఈ సదస్సు అఖిల భారత రాష్ట్ర కార్మిక సంఘానికి చెందిన మహిళా నాయకులు పాల్గొంటారని తెలిపారు. జిల్లాలోని మహిళా కార్మికులు అధిక సంఖ్యలో సదస్సుకు హాజరు కావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు మోరేశ్వర్, వెంకటేశ్, రాజారం, ప్రకాశ్, రవి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న సీఐ బాలాజీ వరప్రసాద్

ఆసిఫాబాద్‌రూరల్: చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని సీఐ బాలాజీ వరప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని అంకుసపూర్‌లో కార్డన్‌సెర్చ్ నిర్వహించి సరైన పత్రాలు లేని వాటికి జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, గంజాయి, మద్యం వంటి వ్యసనాలకు అలవాటు పడకుండా యువత క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి ప్రయోజకులు కావాలన్నారు. సైబర్ క్రైంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఎస్సైలు కొమురయ్య, ఉదయ్ కిరణ్, కమలాకర్, బొజ్జిరావు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు ఇన్సెంటివ్ చెల్లించాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు వెంటనే యాజమాన్యం ప్రకటించిన రూ.5500 దసరా ఇన్సెంటివ్ చెల్లించాలని ఏఐటీయూసీ బెల్లంపల్లి రీజియన్ అధ్యక్షుడు బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. గోలేటిలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం పర్మినెంట్, కాంట్రాక్టు కార్మికులను విభజించి పాలించడం సరికాదన్నారు. పర్మినెంట్ కార్మికులకు లాభాల వాటా సోమవారం చెల్లించగా, కాంట్రాక్టు కార్మికులకు ఎందుకు చెల్లించలేదని ప్రశ్నించారు. యాజమాన్యం బుధవారం లోగా ఇన్సెంటివ్ జమ చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతిభ పురస్కారాల అందజేత

కాగజ్‌నగర్‌టౌన్: పదోతరగతి, ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన ఆర్యవైశ్య విద్యార్థులకు జిల్లా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని వాసవి భవనంలో మంగళవారం ప్రతిభ పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు రాచకొండ నాగేశ్వర్‌రావు, ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.



ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో ఆర్యవైశ్య సంఘం నాయకులు